క్లుప్తంగా

సరుకుల పంపిణీ



ఫలసరుకులు అందజేస్తున్న ధనుంజయరెడ్డి

గూడూరు: పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో గూడూరు రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద దివ్యాంగులకు శుక్రవారం ఫల సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమిడి శ్రీనివాసులు, ఆయన అత్త సిద్ది సుగుణమ్మ జ్ఞాపకార్థం ఈ ఫల సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యం, వా సుగౌడ్, బలరామిరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కి సన్మానం

పెళ్లకూరు: ఏపీఎస్‌పీడీసీఎల్ పెళ్లకూరు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీధర్‌కుమార్‌ను శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్న నేపథ్యంలో పెళ్లకూరులోని ఆ శాఖ అధికారులు, సిబ్బంది శ్రీధర్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ప్రతినిధులు

తడ: ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన 'మొదటి ర్యాంక్‌కు వంద సూత్రాలు' అనే మోటివేషన్ పుస్తకాలను శుక్రవారం తడ బాలికల ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులకు అందజేశారు. గద్వాల్ జిల్లాకు చెందిన విద్యావారధి ఫౌండేషన్ చైర్మన్ సుబ్బరాజు, సూళ్లూరుపేట సేవా సమాఖ్య సంయుక్త సహకారంతో సమకూర్చిన ఈ పుస్తకాలను సేవా సమాఖ్య సభ్యుడు ఉస్మాన్‌బాషా 60 మందికి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి అభినందనలు

దొరవారిసత్రం: ఉత్తమ సేవలందించినందుకు గణ తంత్రదినోత్సవం రోజు జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న నాయుడుపేట రూరల్ సీఐ వైవీ సోమయ్యను శుక్రవారం పలువురు నేతలు కలిసి, అభినందనలు తెలిపారు. వీరిలో దొరవారిసత్రం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, నాయకులు రాజగోపాల్, బాబు రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంఈఓకు సత్కారం



ఎంఈఓను సత్కరిస్తున్న ఎస్టీయూ నేతలు

వెంకటగిరి: స్థానిక ఎంఈఓ వెంకటేశ్వర్లును ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంఈఓ వెంకటేశ్వర్లు అందిస్తున్న విశిష్టసేవలకు గానూ రిపబ్లిక్‌డే సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా సేవాపతకం అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు రత్నయ్య, కోటేశ్వరరావు, చెంచురత్నయ్య, సుబ్రమణ్యం, రమేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పరీక్షాపే చర్చ

వెంకటగిరి: భారత ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వెంకటగిరి పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టి వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, పాఠశాల ప్రిన్సిపల్ విజయభారతి పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలో శుక్రవారం 6, 7, 11, 12, 15వ వార్డుల పరిధిలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, హరినాథ్, మురళి, దీపిక, జయశ్రీ, లత, గురునాగరాజు, సాగీర్‌బీ, షర్మిల, పుట్ట హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

- పనిచేయకుంటే మానేయండి
- డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్



మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

గూడూరురూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలని తిరుపతి జిల్లా డ్వామా పీడీ సీవీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. గూడూరులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం గూడూరు క్లస్టర్ పరిధిలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, డక్కిలి, బాలాయపల్లె మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా పేదలతో పని చేయించి వారికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఎఫ్ఏ నుంచి పీడీ వరకు అందరిపై ఉందన్నారు. అలా పనిచేయడం ఇష్టం లేనివారు ఉద్యోగాలు మానేసి వెళ్లిపోవాలన్నారు. పేదలు చెమట చిందిస్తేనే ఉపాధి పథకంలోని ఉద్యోగులందరూ జీతాలు తీసుకుంటున్నారని, అది మరచిపోకుండా వారికి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. 80 శాతం మందికి 100 రోజులు పనికల్పించి కూలి రూ.257 వచ్చేలా కృషి చేసి, వారికి రూ.25 వేలు అదనపు ఆదాయం లభించేలా చూడాలన్నారు. ఉపాధి కూలీల పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాబ్‌కార్డుల మంజూరు, పనులు గుర్తించి, త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అందరూ చక్కగా పనిచేసి గూడూరు క్లస్టర్‌కు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో గూడూరు ఎంపీడీఓ కె.వేంకటేశ్వరరావు, అంబుడ్స్‌మెన్ రసనాయుడు, ఏపీఓలు, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో, పీఏసీఎస్‌లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డీఈఈ నాగసురేష్, ఎస్ఐ రామస్వామి, ఏఈఈ రామ్మోహన్‌లు తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో దాడులు నిర్వహించగా ఓ దుకాణంలో పీసీ పురుగు మందులు లైసెన్స్ నమోదు చేయక పోవడంపై 142.5 లీటర్లు రూ. 3,77,365 విలువైన మందును స్టాప్‌సేల్స్ చేసినట్లు తెలిపారు. ప్రతి డీలర్లు జీరో ఫారం ఎరువుల లైసెన్స్‌ను పొంది ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఓ సుజాత, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

భోజనం పథకం తనిఖీ



భోజనం పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: టపాయిండ్లు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును శుక్రవారం స్థానిక ఎంఈఓ మస్తానయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు అందుతుందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసం పరిశీలించారు.

'సుకన్య సమృద్ధి యోజన' సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు: సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ఆడపిల్లలున్న వారు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీఏకే కుమార్ తెలిపారు. స్థానిక తపాలా శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పదేళ్లలోపు పిల్లల కోసం సుకన్య సమృద్ధి ఖాతాను తీసుకోవాలన్నారు. ఆర్థిక స్తోమత లేని వారి ఆడపిల్లలకు ఈ పథకం ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. తపాలా కార్యాలయంలో కేవలం రూ.399 ఏడాదికి చెల్లించి, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ పథకంలో చేరేందుకు 18 నుంచి 65 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. చిన్న మొత్తాల పొదుపు పథకాలను ప్రజలందరికీ మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ ప్రతి పోస్టాఫీసులోనూ 500 అకౌంట్లకు తక్కువ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు



మాట్లాడుతున్న సీఐ హరికృష్ణ

వాకాడు: మైనర్లకు వాహనాలు ఇచ్చి, వారు నడిపిన కారణంగా జరిగే పరిణామాలకు వారి తల్లిదండ్రులనే బాధ్యులుగా చేస్తామని వాకాడు సీఐ హరికృష్ణ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో సీఐ పాల్గొని, మాట్లాడారు. ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డిపో మేనేజర్ మధుశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఏకాగ్రతతో వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ రఘురామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

దొరవారిసత్రం: మండలంలో వారం కిందట ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను దొరవారిసత్రం పోలీసులు గుర్తించి, శుక్రవారం బాధితుడికి అప్పగించారు. ఎస్ఐ తిరుమలరావు కథనం మేరకు... చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయుడుపేట నుంచి సూళ్లూరుపేటకు ఆటోలో వెళుతున్న సమయంలో అతని వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ దారపోసుకున్నాడు. ఈ విషయమై అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఐఎంఈఐ నంబర్‌తో కోట మండలం చిట్టేడు ప్రాంతంలో ఫోన్ ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసులు బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి, సెల్‌ఫోన్ అతడికి అప్పగించారు.

దేశానికి ఆదర్శం రాయల పాలన

సూళ్లూరుపేట: శ్రీకృష్ణ దేవరాయల పాలన దేశానికే ఆదర్శమని, ఆయన ప్రజారంజకమైన పరిపాలనను అందించిన గొప్ప చక్రవర్తిగా పేరు గాంచారని రాయలసీమ బలిజ మహాసభ అధ్యక్షులు వెలిశెట్టి శ్రీహరి రాయల్ అన్నారు. సూళ్లూరుపేటలోని శ్రీకృష్ణదేవరాయలు సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయలు 552వ జయంతి వేడుకలను స్థానిక అలవలవారి కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీహరి రాయల్ మాట్లాడుతూ బలిజలు కృష్ణదేవరాయలును ఆదర్శంగా తీసుకోవాలని, ప్రపంచంలోనే ఏరాజు అందించని విధంగా మంచి పరిపాలనను అందించి, ఆదర్శవంతమైన చక్రవర్తిగా వినుతికెక్కారన్నారు. ఈ కార్యక్రమంలో బలిజకాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భీమన శ్రీధర్, నాయకులు ఆకుతోట రమేష్, ఉట్టి మునీంద్రబాబు, బండి రాజేష్, మార్కండేయులు, కొండల్‌రావు, దంతాల రవి, శాంతకుమారి పాల్గొన్నారు.

వీఆర్‌కు పెళ్లకూరు ఎస్ఐ?

పెళ్లకూరు: పెళ్లకూరు ఎస్ఐ కృష్ణారెడ్డిని వారం రోజులు కిందట తిరుపతి వీఆర్‌కి బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు నాయుడుపేట ఎస్ఐ శ్రీకాంత్‌కు పెళ్లకూరు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 16వ తేదీన కనుమ పండుగను పురస్కరించుకుని శిరసనంబేడులో ఏర్పాటు చేసిన పాటకచ్చేరిలో డ్యాన్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు. దీనిపై పెద్ద దుమారం రేగింది. దీంతో ఎస్ఐ కృష్ణారెడ్డిని వీఆర్‌కి బదిలీ చేసినట్లు సమాచారం.

ఏకం ఆలయంలో భక్తుల సందడి



అమ్మ భగవాన్‌లకు హారతి ఇస్తున్న తనయుడు కృష్ణాజీ



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

వరదయ్యపాళెం: మండలంలోని ఏకం(వన్‌నెస్) ఆలయం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. తమిళనాడులోని వెస్ట్ చెన్నై ప్రాంతాల నుంచి 25వేల మందికి పైగా భక్తులు తరలి వచ్చారు. ఆలయంలోని గోల్డెన్ బాల్ వద్ద భక్తులకు అమ్మా భగవాన్ దంపతులు దర్శనమిచ్చి ఆశీస్సులు అందజేశారు. ఉదయం 8 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. క్యూల్లో వచ్చే భక్తులకు అమ్మా భగవాన్ దంపతులు ఆశీస్సులు అందజేశారు. తొలుత ఏకం ఆలయంలో అమ్మా భగవాన్‌లకు వారి తనయుడు కృష్ణాజీ హారతులిచ్చి దర్శనాలను ప్రారంభించారు. సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, స్థానిక ఎస్ఐ నాగార్జునరెడ్డి పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు భోజన వసతులు, ఇతర సౌకర్యాలను ఏకం ప్రతినిధులు ఏర్పాటు చేశారు. లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, ప్రతినిధులు సునీల్ జీ, ఉమాపతి దాసాజీ, రుద్ర దాసాజీ, శ్రీరామ్మూర్తి దాసాజీ ఎప్పటికప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.

సైదాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విజయలక్ష్మి

సైదాపురం: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రస్తుతం డీటీగా విధులను నిర్వర్తిస్తున్న వి విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత వారంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పాల కృష్ణను వెంకటాచలం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అప్పటి నుంచి ఈ స్థానం ఖాళీగా ఉండడంతో ఇక్కడ డీటీగా విధులను నిర్వర్తిస్తున్న విజయలక్ష్మికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ శుక్రవారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి.

శ్రీసిటీ చొరవతో పీహెచ్‌సీకి సెక్యూరిటీ ఏర్పాటు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాత్రివేళల్లో భద్రత నిమిత్తం శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం సెక్యూరిటీని నియమించి చేయూతనిచ్చింది. ఆస్పత్రి సిబ్బందికి రాత్రి వేళల్లో భద్రత కల్పించాలని పీహెచ్‌సీ వైద్యురాలు లావణ్య, యూడీసీ సోమశేఖర్, స్థానికులు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డికి వినతిపత్రం ద్వారా విన్నవించడంతో తక్షణమే ఆయన సానుకూలంగా స్పందించారు. శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం నుంచి ఒక సెక్యూరిటీ గార్డ్‌ను రాత్రివేళల్లో ఆస్పత్రి వద్ద కాపలా ఉంచి, శ్రీసిటీ ద్వారా వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. శ్రీసిటీ ఎండీ చొరవ పట్ల ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు అభినందనలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

శ్రీకాళహస్తి రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిబంధనలు పాటించాలని శ్రీకాళహస్తి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంవీఐ దామోదర్ నాయుడు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని పొయ్య, చిన్నసింగమాల, లింగమనాయుడుపల్లె, రౌతుసూరమాల తదితర గ్రామాల్లో శుక్రవారం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు ఆరోగ్య కేంద్ర సిబ్బందితో కలిసి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. నీటిని నిల్వ చేయడం వల్ల దోమలు వృద్ధి చెంది, డెంగ్యూ, మలేరియా వంటి అంటు వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్‌ను బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో క్రై, ప్రగతి, పోర్డ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. లలితమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాల్లో దక్షిణ భారత్‌లోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 29 శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా బాలికల సంఖ్య రాష్ట్రంలో గణనీయంగా తగ్గుతోందన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 934 మంది మాత్రమే మహిళలు ఉన్నారని చెప్పారు. ఈ గణాంకాల ప్రకారం మహిళలు ఎంత వివక్షకు గురవుతున్నారో అర్థమవుతోందన్నారు. ఆడపిల్లలు లేకపోతే సమాజంలో మనుగడే ఉండదన్నారు. మూఢనమ్మకాలు, మూఢాచారాలు, కులతత్వం వంటివి మహిళలకు శాపంగా మారాయన్నారు. ఆడపిల్లలకు విద్య ఎంతో అవసరమన్నారు. అంతకు ముందు ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో నేటికీ 80శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. ఇవి వారిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వందల సంఖ్యలో బాల్యవివాహాలు జరిగేవన్నారు. అయితే ప్రస్తుతం అధికారులు, పాలకుల చొరవతో గణనీయంగా తగ్గినట్లు చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలనకు తాము కలసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు గురుకుల విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

చిల్లకూరు: జాతీయస్థాయిలో జరిగే క్రీడా పోటీలకు చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులు కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తెలిపారు. చిల్లకూరులోని గురుకుల కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ అండర్- 19 బేస్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి గురుకుల పాఠశాలలో ఇటీవల నిర్వహించారని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న తమ కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించినప్పటికీ జట్టులోని సీనియర్ ఇంటర్ చదివే పీ అభిలాష్, పీ వెంకటేశ్వర్లు, జూనియర్ ఇంటర్‌కు చెందిన బీ యశ్వంత్ అత్యుతమ ప్రతిభ కనపరిచారన్నారు. దీంతో వారి ముగ్గురిని సెలక్షన్ కమిటీ సభ్యులు జాతీయ స్థాయిలో జరిగే బేస్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. అనంతరం జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థుల తోపాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ జానకిరామయ్య, పీఈటీ అఖిల్‌తేజాను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మూర్తి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌రెడ్డికి నేదురుమల్లి పరామర్శ



పులిప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: పోలేరమ్మ ఆలయం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పులిప్రసాద్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పులిప్రసాద్‌రెడ్డి తండ్రి పులి కృష్ణారెడ్డి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆ ప్రాంతానికి చేరకుని కృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రసాద్‌రెడ్డిని పరామర్శించారు సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, చెలికం శంకరరెడ్డి తదితరులు కూడా ప్రసాద్‌రెడ్డిని పరామర్శించారు.

న్యాయవాదులపై దాడులు బాధాకరం



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

గూడూరు: న్యాయవాదులపై దాడులు బాధాకరమని సీనియర్ న్యాయవాది గోపీకృష్ణ పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం కాకినాడలో న్యాయవాది అన్నపూర్ణపై దాడిని నిరసిస్తూ శుక్రవారం స్థానిక న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ సమాజానికి ఎంతో చేరువగా ఉండే న్యాయవాదులపై దాడులు హేయమైన చర్య అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా, ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉమాశంకర్, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో చైతన్య రథయాత్ర



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

సైదాపురం: మండల కేంద్రం నుంచి తురిమెర్ల వరకు శుక్రవారం ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో బహుజన చైతన్య రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సైదాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగన్‌జీవన్‌రావు విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రథయాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ ఫోరం జాతీయ అధ్యక్షుడు వేగా రవి రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, మాకాణి వెంకటేశ్వర్లు, శేఖర్, పెంచలయ్య పద్మజ, కృష్ణరేఖ, మండల నాయకులు మల్లారపు పెంచలయ్య, రమణయ్య, ప్రభాకర్, మస్తానయ్య, వెంకటేశ్వర్లు, మునేంద్ర పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కోట: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువజంట శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు.. కోట మండలం తిన్నెలపూడికి చెందిన గురుస్వామి కుమారుడు సునీల్, శ్యాంసుందరపురం గ్రామానికి చెందిన ఆదిశేషయ్య కుమార్తె ప్రియాంక మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో వారిద్దరు రెండు రోజుల కిందట ఇంట్లో నుంచి పారిపోయి, గూడూరులో వివాహం చేసుకున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని ఎస్ఐ పుల్లారావును ఆశ్రయించారు. ఇద్దరు మేజర్లు కావడంతో వారి పెద్దలను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రానైట్ లారీ సీజ్

చిల్లకూరు: ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము చెల్లించకుండా గ్రానైట్‌ను తరలిస్తున్న ఓ లారీని శుక్రవారం సీజ్ చేసి, ఆ వాహన యజమానిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఒంగోలు పట్టణానికి చెందిన రవి అనే వ్యక్తి తన లారీలో ఎలాంటి పత్రాలు లేకుండా ప్రభుత్వానికి కనీస చార్జీలు చెల్లించకుండా చెన్నైకు గ్రానైట్‌ను తరలిస్తున్నాడు. ఆ సమయంలో జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్న సీఐ ఆ లారీని ఆపి తనిఖీ చేయగా నకిలీ పత్రాలను చూపించడంతో అనుమానం వచ్చి వాటిని సంబంధిత శాఖల ద్వారా తనిఖీ చేయగా అవి నకిలీ పత్రాలని తేలింది. దీంతో రవిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచనట్లు సీఐ తెలిపారు.

శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నింబుజాదేవి ఆలయం ఆవరణలోని శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ పూజలకు విచ్చేసిన మహిళా భక్తులకు సౌభాగ్య మాంగల్యదారాలు, కుంకుమను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విశ్రాంత డీఎస్పీ దలవాయి రాఘుజెట్టి, హిందూ ధర్మప్రచార మండి జిల్లా సభ్యులు రాజ్‌కుమార్, హిందూధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు, ఢిల్లీకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో నూతనంగా నిర్మించిన శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి దాటాక అంబూరు గ్రామ పురవీధుల్లో ప్రత్యేక పుష్పాలంకరణతో అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. ఇంటింటి వద్ద అమ్మవారి కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త సాయిరెడ్డి, ప్రధాన ఆలయ నిర్మాణ దాత ప్రసన్నకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.